నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 12 ఏప్రిల్ 2025 | VIKARABAD

## ఎండ @ 40 డిగ్రీలు



వికారాబాద్, ఏప్రిల్ 11 : వికారాబాద్ జిల్లాలో ఎండలు దంచి కొడుతున్నాయి. అన్ని మండలాల్లోనూ టెంపరేచర్ అధికంగా నమోదవుతున్నది. శుక్రవారం అత్యధికంగా దుద్యాల, మర్పల్లి మండలాల్లో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా.. మిగిలిన మండలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలకు పైగానే ఉన్నది. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ వేడిమి అధికంగా ఉంటున్నది. ఎండ వేడిని తట్టుకునేందుకు ప్రజలు కొబ్బరి బొండాలు, శీతల పానీయాలు, పండ్ల రసాలు తాగుతున్నారు.

**జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రత వివరాలు..**

దుద్యాల 40 డిగ్రీలు, మర్పల్లి 40, కొడంగల్ 39.9, ధారూరు 39.9, యాలాల 39.7, బంట్వారం 39.7, కోట్‌పల్లి 39.6, తాండూరు 39.4, వికారాబాద్ 39.1, పెద్దేముల్ 39, దోమ 39, బషీరాబాద్ 38.9, బొంరాస్‌పేట 38.7, మోమిన్‌పేట 38.5, పూడూరు 38.4, దౌల్తాబాద్ 38.4, నవాబుపేట28.2, పరిగి 37.2, కుల్కచర్ల37.1, చౌడాపూర్ 36.2డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.



బీఆర్ఎస్ రజతోత్సవ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

## దండులా తరలివెళ్లి.. సక్సెస్ చేద్దాం..

బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**రజతోత్సవ మహాసభ గోడపత్రిక ఆవిష్కరణ**

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11 : బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈనెల 27న వరంగల్ లోని ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు దండులా తరలి వెళ్లి.. సక్సెస్ చేద్దామని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఎలిమినేడులోని వ్యవసాయ క్షేత్రంలో రజతోత్సవ గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను కేసీఆర్ నెరవేర్చి రాష్ట్రాన్ని సాధించి..అన్ని రంగాల్లో తెలంగాణను అగ్రగామిగా నిలిపారని కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. ప్రజలు మాత్రం కేసీఆర్‌ను కోరుకుంటున్నారన్నారు. వరంగల్ సభకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌గౌడ్, బుగ్గరాములు, రమేశ్, కిషన్‌గౌడ్, అల్వాల వెంకట్‌రెడ్డి, బిట్ల వెంకట్‌రెడ్డి, బాష, గణేశ్, రఘుపతి, ఐలయ్య, మంద సురేశ్, భాస్కర్ రెడ్డి, జంగయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఉల్లంఘనులు

- మైనింగ్, అటవీ అధికారుల మధ్య సమన్వయలోపం
- అడ్డగోలు అనుమతులపై గనుల శాఖకు నోటీసులిచ్చిన అటవీ శాఖ
- అటవీ శాఖ నిర్లక్ష్యంతో కనుమరుగవుతున్న భూములు
- నేతల ప్రమేయంపై జోరుగా చర్చ

వికారాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల మండలంలోని గౌరారం రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమ గనుల తవ్వకాలు మళ్లీ మొదలయ్యాయి. గతంలో అటవీ భూములంటూ అధికారులు నిలిపివేశారు. అయితే, రెవెన్యూ, అటవీశాఖల అధికారుల నిర్లక్ష్యంతో కొన్నేండ్లుగా మళ్లీ సాగుతున్నాయి. గౌరారంలోని 2,000 ఎకరాల భూములను అటవీశాఖ అధికారులు రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రతిపాదించినా రెవెన్యూ అధికారులు అటవీ భూములను కబ్జా చేసి సాగు చేసిన వారికి పట్టాలిస్తూ పోవడంతో ఆ భూములు 180 ఎకరాలకు కరిగిపోయాయి. అయినా, అవి పట్టా భూములంటూ కొందరు మైనింగ్ వ్యాపారులు కోర్టు కెళ్లడం.. కాదు..కాదు..అవి అటవీ భూములంటూ అటవీశాఖ అధికారులు కౌంటర్ దాఖలు చేయగా.. దానికి సంబంధించిన ఫైళ్లను ఉన్నతాధికారులు పరిశీలించగా.. ఆ భూములు మొత్తం ఫారెస్ట్‌కు చెందిందన్న విషయం బయటపడడంతో అధికారులు అక్రమ గనుల తవ్వకాలను నిలిపివేశారు. అయితే, మైనింగ్ లీజు ముగియడంతో రెన్యువల్‌కు మైనింగ్ వ్యాపారులు దరఖాస్తు చేసుకోగా అటవీ, గనుల శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపంతో గనుల శాఖాధికారులు రెన్యువల్ చేశారు. దీంతో అటవీశాఖ అధికారులు మైనింగ్ అధికారులకు నోటీసులిచ్చారు. రిజర్వ్ ఫారెస్ట్ భూములను ఎలా రెన్యువల్ చేస్తారంటూ తాఖీదులో పేర్కొన్నారు. అయితే, సీఎం సోదరుడి సన్నిహితులే ఈ అక్రమ గనుల తవ్వకాలను కొన సాగిస్తున్నారని.. అందుకే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.





### 2000 ఎకరాలతో రిజర్వ్ ఫారెస్ట్

గౌరారం రిజర్వ్ ఫారెస్ట్ కాగితాలకే పరిమితమైంది. సుమారు 10 లక్షలకు పైగా చెట్లు ఉండాల్సిన ఈ అటవీ ప్రాంతంలో ప్రస్తుతం పెద్ద పెద్ద రాళ్లు, గుట్టలే మిగిలాయి. అంతేకాకుండా 2,000 ఎకరాల్లో రిజర్వ్ ఫారెస్ట్ అనుకున్న ఈ అటవీ ప్రాంతంలోని ఒక్క ఎకరా కూడా అటవీశాఖ అధికారుల ఆధీనంలో ప్రస్తుతం లేకపోవడం గమనార్హం. బొంరాస్‌పేట మండలం, గౌరారంలోని సర్వేనంబర్ 127 లోని 2,000 ఎకరాల అటవీ భూములను 1971లో రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రతిపాదించారు. తదనంతరం అటవీశాఖ అధికారులు ఆ భూములను పట్టించుకోకపోవడంతో క్రమంగా తగ్గుతూ 180 ఎకరాలకు చేరింది. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతో పాటు రెవెన్యూ అధికారులు అటవీ భూములను కబ్జా చేసి సాగు చేసిన వారికి పట్టాలిస్తూ పోవడంతో ప్రస్తుతం ఒక్క ఎకరం కూడా ఫారెస్ట్ ఆఫీసర్ల చేతుల్లో లేకుండా అన్యాక్రాంతమైంది. కాగా, సర్వేనంబర్ రీ అలాట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా సర్వేనంబర్ 127.. 82గా మారింది. సర్వేనంబర్ రీ అలాట్‌మెంట్ అయిన విషయాన్ని రెవెన్యూ అధికారులు అటవీశాఖ అధికారులకు చెప్పకుండానే ఆ ప్రక్రియను పూర్తి చేశారు. అయితే, సంబంధిత 180 ఎకరాల అటవీ భూములూ అన్యాక్రాంతమవుతుండడంతో రెవెన్యూ అధికారులు సర్వేనంబర్ 82 గురించి అటవీ శాఖ అధికారులను ఆరా తీయగా ..ఆ సర్వేనంబర్‌తో మాకు సంబంధం లేదని అప్పటి అధికారులు చెప్పినట్లు సమాచారం. ఎందుకంటే సర్వేనంబర్ 127.. 82గా మారినట్లు వారికి సమాచారం లేకపోవడమే. రిజర్వ్ ఫారెస్ట్‌ను కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో 180 ఎకరాల్లో ఒక్క ఎకరం కూడా ఫారెస్టు శాఖ ఆధీనంలో లేదు. రిజర్వ్ ఫారెస్టుకు వెళ్లి పరిశీలించిన అటవీ శాఖ అధికారులకు అక్కడ రాళ్లు, గుట్టలే కనిపించడంతో కంగుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా.. ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేలా వారు చర్యలు చేపట్టారు.



## పరిశుభ్రతలో నిర్లక్ష్యం

సిటీబ్యూరో, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు కూకట్‌పల్లి ఉడిపి గ్రాండ్, కాప్రా స్వాగత్ గ్రాండ్, ఈ గ్యాలరియా, కోఠి ఉడిపి టిఫిన్స్, సంతోష్ బం జారా రెస్టారెంట్, మినర్వాగ్రాండ్, సైనీ దాబా, అంబర్‌పేట గ్రిల్ రెస్టారెంట్‌ల్లో తనిఖీలు చేపట్టారు. పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఉన్నట్లు తేల్చారు. సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.



గుంతలమయంగా మారిన ముద్దెంగూడ వెళ్లే రోడ్డు

# ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- పట్టించుకోని అధికారులు
- ప్రమాదాల్లో వాహనచోదకులు, పాదచారులు

షాబాద్, ఏప్రిల్ 11 : గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారడంతో నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పూర్తిగా గుంతలమయంగా మారిన రోడ్లపై కాలినడకన వెళ్లే ప్రజలకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. తమ గ్రామాల్లోని రహదారులకు మరమ్మతులు చేయాలని అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామీణ రోడ్లను పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రాలు, పట్టణాలకు వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులన్నీ అధ్వానంగా మారి, గుంతలమయం కావడంతో పెద్ద వాహనాలతోపాటు ద్విచక్ర వాహనదారులూ ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గత బీఆర్ఎస్ హయాంలో మారుమూల గ్రామాలకూ బీటీ రోడ్లు వేయించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నది. కాగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్ల మరమ్మతులూ చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

**గుంతలమయం..**

చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా అధ్వానంగా మారాయి. షాబాద్ మండలంలోని బోడంపహాడ్, మన్మర్రి, ముద్దెంగూడ, కుమ్మరిగూడ, నాగరకుంట, ఎర్రొనిగూడ, రేగడిదోస్వాడ, నాందార్‌ఖాన్‌పేట, శంకర్‌పల్లి మండలంలోని అంతప్పగూడ, సంకెపల్లి, చేవెళ్ల మండలంలోని మడికట్టు, ఆలూర్, మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్ తదితర గ్రామాలకు వెళ్లే దారులు పూర్తిగా గుంతలమయంగా మారి తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. బోడంపహాడ్ వెళ్లే దారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది గాయాలపాలైన ఘటనలున్నాయి. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.





**నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి**



తమ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. 20 రోజుల కిందట రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. రోడ్డును బాగు చేయాలని అధికారులు, పాలకులకు పలు మార్లు చెప్పినా ఫలితం లేదు.

**-కారు చెన్నయ్య, బోడంపహాడ్, షాబాద్**

**రోడ్డు పూర్తిగా పాడైంది..**



గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైంది. హైవే నుంచి 5 కిలోమీటర్ల దూరంలోనే మా గ్రామం ఉంటుంది. ఎన్నికలప్పుడే పాలకులకు ప్రజలు గుర్తుకొస్తారు.. తర్వాత మరిపోతారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో ద్విచక్రవాహనంపై వెళ్లాలన్నా అవస్థలు తప్పడంలేదు. **-బండ నర్సింహారెడ్డి, మన్‌మర్రి, షాబాద్**

## మీటర్ మారిస్తే ₹1500

**చాయ్‌పానీ ఖర్చులంట.. క్షేత్రస్థాయిలో సిబ్బంది చేతివాటం**



సిటీబ్యూరో, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): గోల్నాక సెక్షన్ లోని ఓ ఇంట్లో మీటర్ రీడింగ్ తీయడానికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వచ్చాడు. రీడింగ్ తీసే సమయంలో మీటర్ మార్చుకోవాలంటూ సూచించాడు. ఆ తర్వాత డిజిటల్ మీటర్ తెచ్చిపెట్టాడు. ఇందుకోసం తనకు రూ.1200 ఫోన్‌పే చేయాలని అడిగాడు. ఎందుకంటే చాయ్‌పానీ ఖర్చులన్నాడు. బాజాప్తుగా ఫోన్‌పేలో డబ్బులు తీసుకున్నాడు. ఆ తర్వాత మీటర్ తెచ్చిపెట్టి ఒక మీటర్ చేంజ్ పేరుతో ఉన్న డూప్లికేట్ రసీదు ఇచ్చాడు. దానిపై అసిస్టెంట్ ఇంజినీర్ ఆపరేషన్స్ అని ఉన్నచోట ఈ మీటర్ రీడరే సంతకం పెట్టి ఇచ్చాడు. ఇదంతా అంబర్‌పేట డివిజన్‌లో జరిగింది. ఇలా ఆ ఒక్క ఏరియాలోనే ఎనిమిది మంది వద్ద రూ.1200 నుంచి రూ.1500 వసూలు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు చెప్పినా తనకేం కాదని, ఇందులో వారికే పెద్ద వాటా ఉంటుందని ఆ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అంటున్నారని వారు పేర్కొన్నారు. మీటర్ మార్చాలంటే డబ్బులు చెల్లించొద్దని, ఇందుకు సంబంధించి ఎస్పీడీసీఎల్ ఉచితంగా మీటర్ మార్చాలని ఉన్నప్పటికీ ఈ విధంగా వసూలు చేయడం ఏంటని అంబర్‌పేట సెక్షన్ విద్యుత్ అధికారులకు చెప్పినా ఫలితం లేదని సదరు వినియోగదారుడు వాపోయాడు.

**పై సిబ్బందికి వాటాలంటూ..**

పాత మీటర్ల స్థానంలో డిజిటల్ మీటర్లు బిగిస్తున్న సిబ్బంది ఆ సమయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారంటూ ఎస్పీడీసీఎల్ ఆఫీసుకు అనేక ఫిర్యాదులున్నాయి. తమకు ఇచ్చే డబ్బుల్లో శాఖలో ఉన్న పై సిబ్బందికీ వాటా లివ్వాలంటూ సదరు మీటరు బిగిస్తున్న సిబ్బందే చెబుతున్నారు. ఏఈలు సంతకం పెట్టి ఇవ్వాల్సిన రసీదును వారే ఏకంగా సంతకాలు పెట్టి ఇస్తున్నారంటే వీరి దందా ఎంత బాహాటంగా నడుస్తుందో తెలుస్తున్నది.

## గౌలిగూడ టూ తాడ్‌బండ్

**నేడు హనుమాన్ విజయయాత్ర..**

సిటీబ్యూరో: నగరంలో శనివారం జరిగే హనుమాన్ విజయోత్సవ యాత్రకు 20వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ నగర సీపీ ఆనంద్ తెలిపారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఉంటుందని, హైదరాబాద్ సిటీ పరిధిలో 150, రాచకొండ, సైబరాబాద్‌ల నుంచి వచ్చే 46 ర్యాలీలు ఈ యాత్రలో కలుస్తాయన్నారు. వీరహనుమాన్ విజయోత్సవ ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. గౌలిగూడ శ్రీరామమందిరం నుంచి తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు సుమారు 12.2 కిలోమీటర్ల మేర యాత్ర జరగనున్నదని, ఉదయం 11 గంటలకు యాత్ర ప్రారంభమై రాత్రి 9గంటలకు ముగుస్తుందన్నారు. పుత్లిబౌలి, కోఠి, సుల్తాన్‌బజార్, నారాయణగూడ, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, గాంధీనగర్, కవాడిగూడ, బైబిల్‌హౌజ్, రాంగోపాల్‌పేట, ప్యారడైజ్ ప్రాంతాల మీదుగా యాత్ర జరుగుతుందన్నారు. విజయయాత్ర సందర్భంగా శనివారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

# ఖాళీగా కనిపిస్తే..కబ్జానే..!

- రంగారెడ్డి జిల్లాలో పెరుగుతున్న భూ సమస్యలు
- నకిలీ పత్రాలతో భూముల కబ్జా
- యజమానులు వచ్చే సరికే ఇతరులకు విక్రయం
- డబుల్ రిజిస్ట్రేషన్లతోనూ కొనుగోలు దారుల మధ్య వివాదాలు, పోలీసు కేసులు
- భూముల ధరలు పెరగడంతోనే..

రంగారెడ్డి, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో భూసమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. శివారు ప్రాంతాల్లో భూ ముల ధరలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి భూములను కబ్జా చేస్తున్నారు. భూవివాదాలతో శాంతిభద్రతల సమస్య తలెత్తి పోలీసులకు సవాల్‌గా మారుతున్నది. జిల్లాలో 16 మున్సిపాలిటీలు, 2 మున్సిపల్ కార్పొరేషన్లున్నాయి. ఈ మున్సిపాలిటీల పరిధి నుంచి ఔటర్‌రింగ్ రోడ్డు వెళ్లడంతో శివారు ప్రాంతాల్లో భూములకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఔటర్ లోపలి గ్రామాల్లో గజం భూమి విలువ రూ. 30,000 నుంచి రూ. 1,00,000 వరకు చేరింది. దీంతో ఖాళీగా ఉన్న భూములపై కొంతమంది తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్నారు. అసలు యజమానులు ఒరిజినల్ పత్రాలతో వచ్చేలోపే వాటిని ఇతరులకు విక్రయిస్తున్నారు. అలాగే, ఔటర్ వెలుపలి గ్రామాల్లోనూ భూసమస్యలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా పెద్దఅంబర్‌పేట, తుర్కయాంజాల్, ఆదిబట్ల, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం వంటి మున్సిపాలిటీల్లో అధికంగా ఉన్నాయి.



తుర్కయాంజాల్‌లో ఇటీవల శాంతిభద్రతల సమస్యకు కారణమైన కమ్మగూడ గ్రామంలోని భూమి ఇదే (ఫైల్)

**కమ్మగూడలో తలెత్తిన శాంతిభద్రతల సమస్య..**

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ గ్రామంలో భూసమస్యపై ఇరువర్గాల వారు పరస్పరం దాడులకు దిగి వాహనాలకూ నిప్పు పెట్టడంతో శాంతిభద్రతల సమస్య తలెత్తింది. ఈ గ్రామంలోని సర్వేనంబర్ 240, 241, 242లలో ఉన్న పదెకరాలపై కొంతకాలంగా వివాదం జరుగుతున్నది. ఈ సర్వేనంబర్‌లోని భూమి తమదంటూ కొందరు ఇప్పటికే కొన్ని ప్లాట్లు చేసి విక్రయించారు. ఇటీవల కోర్టు తమకే అనుకూలంగా తీర్పునిచ్చిందని మరికొందరు భూమి తమదేనటు అక్కడికి రావడంతో ఇరువురి మధ్య పరస్పరం రాళ్ల దాడులు జరిగాయి. ఇరువర్గాల వారు పెద్ద ఎత్తున జనాన్ని పోగుచేసుకోవడంతో గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తడంతో పోలీసులు పికెట్‌ను ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా ఆ భూమి వైపు ఎవరూ వెళ్లొద్దంటూ 160 సెక్షన్ అమల్లోకి తీసుకొచ్చారు.

అలాగే, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని కుంట్లూరు గ్రామంలోనూ పట్టాదారులు, ప్లాట్ల యజమానులకు మధ్య భూవివాదం కొనసాగుతున్నది. ఆదిబట్ల ఠాణా పరిధిలోని పలు గ్రామాల్లోనూ భూసమస్యలు పెద్ద ఎత్తున తలెత్తుతున్నాయి. ఔటర్‌రింగ్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లోనూ భూ సమస్యలకు సంబంధించిన కేసులు ప్రతిరోజూ ఆయా ఠాణాలకు చేరుతున్నాయి. బాధితులు న్యాయం చేయాలని పోలీసులను కోరుతున్నారు.

**గ్రామాల్లో డబుల్ రిజిస్ట్రేషన్ల వివాదాలు..**

జిల్లాలో 21 మండలాలు గ్రామీణ ప్రాంతాలుగా ఉన్నాయి. ఈ మండలాల్లో డబుల్ రిజిస్ట్రేషన్ల వివాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొన్నేండ్ల కిందట భూములను కొని ప్లాట్లు చేసి విక్రయించారు. భూములు కొనుగోలు చేసిన వారి పేర్లు రికార్డుల్లో నమోదు కాకపోవడంతో.. గతంలో భూములు విక్రయించిన వారి పేరుమీదనే పాస్‌బుక్కులొచ్చాయి. దీంతో కొత్తగా పాస్‌బుక్కులు రావడంతో ఆ భూమిని మరొకరికి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ డబుల్ రిజిస్ట్రేషన్లతో ఇరువురు కొనుగోలు దారుల మధ్య వివాదాలు తలెత్తి పోలీస్‌స్టేషన్ల వరకు ఆ గొడవ వెళ్తున్నది. ఈ సమస్య అనేక గ్రామాల్లో కొనసాగుతున్నది.

**తెరపైకి నకిలీ పత్రాలు..**

జిల్లాలో నకిలీ ధ్రువపత్రాలు పెద్ద ఎత్తున తెరపైకి వస్తున్నాయి. భూముల ధరలు పెరగడంతో ఎప్పుడో ప్లాట్లు కొనుగోలుచేసి విదేశాలకు వెళ్లిన వారు ఇక్కడ లేకపోవడాన్ని ఆసరాగా తీసుకుంటున్న కొందరు.. ఆ ప్లాట్లపై తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి విక్రయిస్తున్నారు. దాని యజమానులు చాలా రోజుల తర్వాత వచ్చి తమ ప్లాట్లను చూసుకునే సరికి ఆ కబ్జాలోకి మరొకరు వస్తున్నారు. అలాగే, ఇనాం లాంటి భూములపైనా తప్పుడు ఓఆర్‌సీలు సృష్టిస్తూ కొంతమంది భూములు తమవంటూ ముందుకొస్తుండడంతో భూసమస్యలు తలెత్తుతున్నాయి.

**భూతగాదాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం**

నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి భూములను కబ్జా చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. శివారు ప్రాంతాల్లో నకిలీ పత్రాలను సృష్టించి భూములను కబ్జా చేస్తున్నట్లు పలు ఫిర్యాదులొచ్చాయి. భూ వివాదాలకు పాల్పడే ముఠాలను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

**-కేపీవీ రాజు, ఇబ్రహీంపట్నం ఏసీపీ**